క్లుప్తంగా

ఐపీఎం ఉద్యోగసంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



గుంటూరు మెడికల్: వైద్య ఆరోగ్య శాఖలో ఎంతో ప్రాధాన్యత కలిగిన ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్, డిపార్ట్ మెంట్‌లో అన్ని కేడర్‌ల ఉద్యోగుల హక్కుల కోసం నిరంతరం శ్రమిస్తున్న ఐపీఎం ఉద్యోగుల సంఘం 2025 నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం గురువారం జరిగింది. ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్, ఫుడ్ సేఫ్టీ కమిషనర్, ఐపీఎం డైరెక్టర్ వాకాటి కరుణ, ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వినుకొండ రాజారావు క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. జాయింట్ ఫుడ్ కంట్రోలర్ ఎస్.పూర్ణచంద్రరావు, సంఘ నాయకులు జయప్రకాష్, రవీంద్రారెడ్డి, ఎం.వి.లక్ష్మీశివకుమార్, అఖిల్, భాస్కరరావు, నాగేశ్వర్ రెడ్డి, రామకృష్ణ, వెంకట్రావు, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కార్పెంటర్స్-వర్కర్స్ క్యాలెండర్ ఆవిష్కరణ

లక్ష్మీపురం: కార్పెంటర్స్-వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించడం సంతోషంగా ఉందని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ అన్నారు. స్థానిక కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో గురువారం ది గుంటూరు సిటీ కార్పెంటర్స్-వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడా హనుమంతరావు, యూనియన్ గౌరవాధ్యక్షుడు కాయల రామా రావు, కార్యదర్శి డేగల వెంకటేశ్వరరావు, అధ్యక్షులు జంపని ఫకీరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏబీ బర్ధన్‌కు ఘననివాళి



లక్ష్మీపురం: సీపీఐ జాతీయ పూర్వ ప్రధాన కార్యదర్శి ఏబీ బర్ధన్ వర్ధంతి స్థానిక కొత్తపేటలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో గురువారం నిర్వహించారు. పార్టీ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ పాల్గొని బర్ధన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నగర కార్యదర్శి కోట మాల్యాద్రి మాట్లాడారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకిటి అరుణ్ కుమార్, మేడా హనుమంతరావు, నగర అధ్యక్షుడు రావుల అంజిబాబు, ఏఐవైయఫ్ జిల్లా అధ్యక్షుడు జంగాల చైతన్య, తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

5న ప్రత్యేక నృత్య ప్రదర్శన

నగరంపాలెం: ఈనెల ఐదో తేదీన శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో శ్రీనవదుర్గాన్వితం, మహిష మర్దనం అనే అంశంపై నృత్య ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు నృత్య కళాభారతి అధ్యక్షులు, నాట్య విశారద ఎస్.బాలు, నాట్యాచారిని నవ్యశ్రీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సంస్థ ఐదో వార్షికోత్సవాన్ని సందర్భంగా ఈ ప్రదర్శన చేపట్టామని అన్నారు. 85 మంది విద్యార్థినులతో ప్రత్యేకాంశంతోపాటు కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఉంటాయన్నారు. కళాకారులు, కళాభిమానులు హాజరుకావాలని తెలిపారు.

డాక్టర్ యశశ్వికి ఏపీ ఎన్జీఓ నేతల శుభాకాంక్షలు



గుంటూరు మెడికల్: నూతన సంవత్సరం సందర్భంగా ఏపీ ఎన్జీఓ నేతలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణను గురువారం మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఏపీ ఎన్జీజీవోస్ అసోసియేషన్ గుంటూరు జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎ.శ్యామ్‌సుందర్ శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు డీడీ నాయక్, జిల్లా జాయింట్ సెక్రటరీలు ఎస్.సుకుమార్, కూరాకుల శ్రీనివాసరావు, నగర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్పీఎస్ సూరి, సిహెచ్ కళ్యాణ్ కుమార్, నగర కోశాధికారి విజయ్ కుమార్, ఉమెన్స్ జాయింట్ సెక్రటరీ సునీత, జిల్లా ఉమెన్ వింగ్ చైర్ పర్సన్ ఎం.రాధా రాణి, నర్సంగ్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ పద్మజ తదితరులు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.

నేడు పట్టణ ప్రణాళిక ఓపెన్ ఫోరం

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో పట్టణ ప్రణాళిక అంశాలకు సంబంధించిన అర్జీలు, ఫిర్యాదులు, సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు ప్రతి శుక్రవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో ఉదయం 10 గంటల నుంచి ఓపెన్ ఫోరం నిర్వహించనున్నామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర ప్రజలు, లైసెన్స్ ఇంజినీర్లు, తమ సమస్యల పరిష్కారానికి ఏర్పాటు చేసిన ఫోరంను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

బదిలీల ఫైల్ కదిలేనా..!

- కొలిక్కి రాని వర్క్ ఇన్‌స్పెక్టర్ల బదిలీలు
- ఫైల్ సిద్ధమైనప్పటికీ బదిలీల ఊసే రాని వైనం
- ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లతోనే ఫైల్ పక్కన పెడుతున్నారని ఆరోపణలు
- ఇక ఎవరూ కదిలించలేరనే ధీమాతో ఉన్న వర్క్ ఇన్‌స్పెక్టర్లు



నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలోని వివిధ రిజర్వాయర్లలో దశాబ్దాలు తరబడి వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఇతర అవుట్ సోర్సింగ్ సిబ్బంది పనిచేయడంతో వారి అవినీతికి అంతు లేకుండా పోతుంది. వర్క్ ఇన్‌స్పెక్టర్లే విచ్చలవిడిగా అనధికార ట్యాపులు ఇవ్వడం, రిజర్వాయర్లలో ఉంచిన పాత పైపులైన్లను అమ్ముకోవడం, వార్డుల్లో కాంట్రాక్ట్ వర్కులు చేసుకుంటూ భారీ స్థాయిలో అక్రమాలకు పాల్పడుతున్నారు. దీనిపై 'సాక్షి'లో వరుస కథనాలు వెలువెడ్డాయి. దీనిపై నగర కమిషనర్ సీరియస్ అయ్యారు. వర్క్ ఇన్‌స్పెక్టర్ల పనితీరుపై ఎంక్వయిరీ చేసిన కమిషనర్ ఏళ్ల తరబడి పాతుకుపోయి, కాంట్రాక్టులు చేసుకుంటున్న వైనం, అనధికారికంగా పైపులైన్ కనెక్షన్‌లు ఇస్తున్న వైనాలు తెలుసుకుని వారిని బదిలీ చేయాలని గత కొద్ది నెలల కిత్రం ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కానీ ఇంతవరకు బదిలీల ప్రక్రియ ఒక కొలిక్కి రాలేదని చెప్పుకోవాలి. నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగంలో బదిలీలకు సంబంధించిన ఆర్డర్ ఈరోజు, రేపు వస్తుందని చెప్పుకుంటూ కాలం వెల్లదీస్తున్నారు.

అంతా సిద్ధమైనా..

గత కొద్ది రోజుల క్రితం జరిగిన నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశంలో నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్, ప్రజారోగ్య విభాగాలను ప్రక్షాళన చేస్తామని ప్రకటించారు. ఇందులో భాగంగానే 22 శానిటరీ డివిజన్లను 32కి పెంచి ఆయా డివిజన్లకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ల కేటాయించారు. అదేవిధంగా ఇంజినీరింగ్ విభాగంలో పని చేస్తున్న వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ట్యాప్ వర్కర్లను బదిలీలు చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. కాని ఇంజినీరింగ్ అధికారులు ఈ బదిలీలకు మోకాలడ్డుతున్నారనేది జగమెరిగిన సత్యం. వీరిని బదిలీ చేస్తే ఎక్కడ తమ ఆదాయానికి గండిపడుతుందనే ధోరణితోనే వారిని బదిలీ చేయకుండా నెట్టుకొస్తున్నారు. మరోవైపు ప్రజాప్రతినిధుల నుంచి వస్తున్న ఒత్తిడి కారణంగానే బదిలీలు ఆగిపోయాయని నగరపాలక సంస్థ కార్యాలయంలో చెప్పుకోవడం చర్చనీయాంశంగా మారింది.

ధీమాలో వర్క్ ఇన్‌స్పెక్టర్లు..

బదిలీల వ్యవహారం గత రెండు నెలల నుంచి జరుగుతున్నప్పటికీ ఇంత వరకు బదిలీలు జరగకపోవడంతో వర్క్ ఇన్‌స్పెక్టర్లలో ధీమా పెరిగిందనే చెప్పుకోవచ్చు. నగరపాలక సంస్థలో ఏదైనా విభాగంలో బదిలీలు జరుగుతాయని బయటికి తెలిస్తే వెంటనే జరిగిపోతాయి. కాని గత రెండు నెలలు పైబడి వర్క్ ఇన్‌స్పెక్టర్ల బదిలీలు జరుగుతాయని స్పష్టమైన ప్రకటన ఉన్నప్పటికీ బదిలీలు జరగకపోవడంతో వర్క్ ఇన్‌స్పెక్టర్లు ఒకింత ఆనందంలో ఉన్నారని నగర పాలక సంస్థ కార్యాలయంలో గుసగుసలు వినిపిస్తున్నాయి.

చదువుకు పేదరికం అడ్డు రాకూడదు



బీసీ బాలికల వసతి గృహంలో విద్యార్థినులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి

- ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి
- స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు దుప్పట్లు పంపిణీ

పట్నంబజారు: మానవుని జీవితంలో ప్రతి ఒక్కరి ఉన్నతికి పదవే ప్రమాణికమని ఎమ్మెల్సీ, వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, స్ఫూర్తి ఫౌండేషన్ వ్యవస్థాపకులు లేళ్ల అప్పిరెడ్డి చెప్పారు. నూతన సంవత్సరంలో మొదటి కార్యక్రమంగా స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం అరండల్‌పేటలోని బాలికల వసతి గృహంలో విద్యార్థినులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ చదువుకు పేదరికం అడ్డుకాకూడదన్నదే స్ఫూర్తి ఫౌండేషన్ లక్ష్యం అన్నారు. పేదరికంలో పుట్టడం ఎవరి తప్పు కాదని, కాని పేదరికంలో మరణించడం మాత్రం వారి తప్పే అవుతోందన్న పెద్దల మాటలు అక్షర సత్యాలని తెలిపారు. కేవలం విద్యద్వారానే పేదల జీవితాలో సమూలనమైన మార్పు సాధ్యమని స్పష్టం చేశారు. పేదరికం నుంచి బయటపడేందుకు ఏకైక మార్గం విద్య అన్న అంశాన్ని గుర్తించి విద్యార్థులు ముందుకు సాగాలన్నారు. విద్యార్థులకు సాయం అందించడంలో స్ఫూర్తి ఫౌండేషన్ ఎల్లప్పుడు ముందుంటుందన్నారు. ప్రభుత్వ వసతి గృహాల్లోని విద్యార్థుల దుప్పట్లు పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని, ఇది ఆరంభం అని తెలిపారు. స్ఫూర్తి ఫౌండేషన్ సభ్యులు, వైఎస్సార్ సీపీ నేతలు, కార్పొరేటర్లు బందా రవీంద్రనాథ్, ఆలా సాంబశివరావు, బత్తుల దేవానంద్, ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి), పాపతోటి అంబేద్కర్, షేక్ రోషన్, ఎ.వెంకటరెడ్డి, గురవయ్య, రత్నప్రసాద్, పి.శ్రీనివాసరావు, నూనె ఉమామహేశ్వరరెడ్డి, పానుగంటి చైతన్య, షేక్ రబ్బాని, మంత్రి మహానంది, కొత్తపేట సతీష్, మద్దుల రాజాయాదవ్, చల్లా కోటి, వెంకటరమణ, సుబ్బరాజు, కొండలు, మేకల నగేష్, ప్రసన్న, ఆలా కిరణ్, నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, దాసు, రెడ్డి కోటేశ్వరరావు, ఆటో శ్రీను, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

డాబాపై నుంచి కిందపడి వ్యక్తి మృతి

పట్నంబజారు: ప్రమాద వశాత్తు డాబాపై నుంచి కిందపడి వ్యక్తి మృతిచెందిన సంఘటనపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాజాగారితోటలో నివాసం ఉండే కొమ్మూరు పకీర్ (41) బుధవారం వీధి కుక్క ఇంట్లోకి రావడంతో తరిమేందుకు డాబాపైకి వెళ్లాడు. ప్రమాదవశాత్తు డాబాపై నుంచి జారి కిందపడ్డాడు. హుటాహుటిన ఆసుపత్రికి తరలించే సమయానికి మృతిచెందాడు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పదహారు రోజుల పండుగ ప్రారంభం



నగరంపాలెం: స్థానిక ఆర్.అగ్రహారం శ్రీరామనామ క్షేత్రంలోని అద్దాల మండపంలో గురువారం పదహారు రోజుల పండుగ మొదలైంది. శ్రీసీతారాములను రకరకాల పుష్పాలతో అలంకరించారు. పల్లకిలో శ్రీరామ నామస్మరణతో భక్తులు సుగంధ ద్రవ్యాలను చల్లుతూ అద్దాల మండపానికి తీసుకు వచ్చారు. ప్రత్యేకంగా అలంకరించిన ఊయలలో సీతారాములను పవళింప చేసి, ఫలాలను ప్రసాదాలుగా ఉంచి సేవించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు. ట్రస్టీస్ రాగం వెంకటలీలా సుందరి, బెల్లంకొండ మస్తాన్‌రావు దంపతులు, ఆలయ అర్చకులు పర్యవేక్షించారు.

హిందూ ఫార్మసీ కళాశాలకు నాక్ గుర్తింపు



నాక్ గుర్తింపు పత్రంతో జూపూడి రంగరాజు, నాగభూషణం తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలకు నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (నాక్) గుర్తింపు లభించినట్లు కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు తెలిపారు. గురువారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో జూపూడి రంగరాజు మాట్లాడుతూ గతేడాది నవంబర్ 5, 6 తేదీల్లో కళాశాలను సందర్శించిన నాక్ పీర్ టీం కళాశాలలో వసతులు, విద్యాబోధన, ప్రయోగశాలలు తదితర అంశాలను పరిగణలోకి తీసుకుందని వివరించారు. నాక్ టీం సందర్శన సమయంలో అవసరమైన డేటాను సమగ్రంగా తయారు చేసి సమర్పించడంలో కృషి చేసిన అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి అభినందనలు తెలియజేశారు. 2025లో రాష్ట్ర, జాతీయస్థాయి కాన్ఫరెన్స్‌లను నిర్వహించి, ఫార్మసీ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ నూతన ఆవిష్కరణలపై అవగాహన కల్పించాలని అన్నారు. బయోటెక్నాలజీ, కృత్రిమ మేధ, మెషీన్ లెర్నింగ్, డేటా అనలిటిక్స్‌పై విద్యార్థులకు శిక్షణా తరగతులను నిర్వహించి, ఆయా రంగాల్లో నిష్ణాతులుగా తయారు చేయాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంపీ నాగభూషణం, డాక్టర్ ఆర్. గోవిందరాజన్, డాక్టర్ పి.సీతారామయ్య పాల్గొన్నారు.


బ్రాహ్మణ సేవా సమితి క్యాలెండర్ ఆవిష్కరణ



గుంటూరు మెడికల్: బ్రాడీపేట 1/13 బ్రాహ్మణ సేవా సమితి చెవిటి గంటి రామకృష్ణశాస్త్రి సహకారంతో రూపొందించిన 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను గురువారం సమితి కార్యాలయంలో సీనియర్ కార్యవర్గ సభ్యులు మతుకుమల్లి కోదండ రామారావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో కార్యదర్శి తుళ్లూరు ప్రకాష్, కార్యవర్గ సభ్యులు, పొత్తూరు మురళీమోహన రావు, నంది రాజు పాండురంగారావు, మన్నవ దివాకర శర్మ, మాదల వెంకటకృష్ణ, పాతూరి శ్రీనాథ్, బొప్పూడి కృష్ణ ప్రసాద్, అవ్వారి మంగాదేవి పాల్గొన్నారు.

కంకర కుప్పలతో తిప్పలు

- ప్రధాన రహదారిపై రెండు నెలలుగా కంకర, ఇసుక కుప్పలు
- నిర్మాణ పనులు ఆలస్యం..
- ప్రమాదాలకు గురవుతున్న వాహన చోదకులు



కంకర రాళ్ల గుట్టలు



ఇసుక కుప్పల వద్ద జాగ్రత్తగా వెళ్లాల్సిందే..

నగరంపాలెం: రహదారి పనుల నిమిత్తం రాశులుగా నిల్వచేసిన కంకర రాళ్లు, ఇసుక వల్ల ఇటువైపు రాకపోకలు సాగించేవారు ఇబ్బందులకు గురవుతున్నారు. సుమారు రెండు నెలలు క్రితం అరండల్‌పేట 10/2 నుంచి 9/2, 8/2వ అడ్డరోడ్డు వైపు ప్రధాన రహదారిపై తారురోడ్డు నిర్మాణ పనుల నిమిత్తం కంకర రాళ్లు, ఇసుక తోలి రహదారిపై పెద్ద కుప్పలుగా పోశారు. అయితే నెలలు గడిచినా నిర్మాణ పనులు ప్రారంభించలేదు. దీంతో ఇసుకంతా రోడ్డుపైకి చేరింది. అరండల్‌పేట, శ్రీనగర్ ఏరియాల వైపు వెళ్లేందుకు వాహన చోదకులు ఇటువైపే ఎక్కువగా వస్తుంటారు. అయితే ఇసుకంతా రోడ్డుపైకి వచ్చి చేరడంతో అక్కడకు వచ్చేసరికి వాహనదారులు నెమ్మదిగా వెళ్లాల్సి వస్తోంది. రాత్రిళ్లు మోటారు సైకిళ్లు అదుపు తప్పి కిందపడిన సంఘటనలు లేకపోలేదని స్థానిక దుకాణదారులు వాపోతున్నారు. నెలలు గడిచినా రోడ్డు నిర్మాణ పనులు చేపట్టలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జీఎంసీ అధికారులు స్పందించి, నిర్మాణ పనులు చేపట్టాలని పాదచారులు, వాహన చోదకులు కోరుతున్నారు.

నూతన డ్రెయిన్ల నిర్మాణానికి చర్యలు

నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు



సంపత్‌నగర్‌లో పర్యటించి, అధికారులకు సూచనలిస్తున్న మేయర్ కావటి మనోహర్ నాయుడు

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో పాడైన డ్రెయిన్ల స్థానంలో నూతన డ్రెయిన్లు నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని నగర మేయర్ కావటి శివ నాగమనోహర్ నాయుడు తెలిపారు. గురువారం నగరంలోని సంపత్ నగర్ 2వ లైన్ పార్క్ రోడ్డు, శృంగేరి శారద పరమేశ్వరి గుడిరోడ్డు, అయ్యప్ప స్వామి గుడి రోడ్లలో పర్యటించి ఆయా ప్రాంతాలలో నూతన డ్రెయిన్లు నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఇటీవల సంపత్ నగర్ 2వ లైన్ పార్క్ రోడ్డు, శృంగేరి శారద పరమేశ్వరి గుడి రోడ్డు, అయ్యప్పస్వామి ప్రాంతాల ప్రజలు మేయర్‌ను కలిసి తమ ప్రాంతాల్లో రోడ్లు నిర్మించి చాలా కాలం అయినందున మరమ్మతులకు లోనై చిన్నపాటి వర్షానికే మురుగు నీరు రోడ్లపైకి వస్తుందని ఫిర్యాదు చేయగా.. మేయర్ ఆయా ప్రాంతాలలో నగర పాలక సంస్థ అధికారులతో కలిసి పర్యటించారు. పాడైన డ్రెయిన్ల స్థానంలో నూతన డ్రెయిన్లు నిర్మించాలని, అవసరమైన చోట కల్వర్టులను నిర్మించాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా నగరంలోని అన్ని డివిజన్లలో మరమ్మతులకు గురైన స్థానికంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్న ప్రాంతాలలో కూడా డ్రెయిన్లు నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆయనవెంట నగర పాలక సంస్థ డీఈఈ మధుసూదన రావు, ఏఈ శైలజ, సచివాలయాల కార్యదర్శులు, వైఎస్సార్ సీపీ 20వ డివిజన్ అధ్యక్షుడు కంతేటి శ్యాం శేఖర్, జవ్వాజి రాంబాబు, ఈశ్వర్ రెడ్డి, గోపి, వెంకటేశ్వర్లు, స్థానికులు పాల్గొన్నారు.

ట్రేడ్ లైసెన్స్‌లపై సమగ్ర నివేదిక ఇవ్వండి

నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు



ప్రజారోగ్య అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో 10వ తేదీలోగా శానిటరీ డివిజన్ల వారీగా ట్రేడ్ లైసెన్స్‌లపై శానిటరీ ఇన్‌స్పెక్టర్లు సమగ్ర నివేదిక ఇవ్వాలని, 17 నుంచి డీఅండ్ఓ ట్రేడ్ లైసెన్స్‌లపై స్పెషల్ డ్రైవ్ చేపట్టనున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. గురువారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ప్రజారోగ్య విభాగ అధికారులతో ట్రేడ్ లైసెన్స్‌లు, పారిశుద్ధ్య పనులపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వార్డు సచివాలయాల వారీగా డీఅండ్ఓ ట్రేడ్ లైసెన్స్‌లు ఉండాల్సిన సంఖ్య కన్నా తక్కువగా ఉన్నాయని, నూతనంగా శానిటరీ డివిజన్ల పునర్విభజన చేసినందున శానిటరీ ఇన్‌స్పెక్టర్లు తమ డివిజన్ పరిధిలో ప్రస్తుతం ఉన్న ట్రేడ్ లైసెన్స్‌ల వివరాలపై వారం రోజుల్లో సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. నివేదిక మేరకు క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తామని, నగరంలోని కమర్షియల్ సంస్థలు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలని స్పష్టం చేశారు. నగరంలో పారిశుద్ధ్య విభాగ పనితీరులో మార్పు రావాలని, 3 నుంచి 9వ తేదీ వరకు స్పెషల్ శానిటేషన్ వీక్‌గా రోడ్ల మీద వ్యర్థాలు, డెబ్రిస్ తొలగించాలన్నరు. 802 మైక్రో ప్యాకెట్స్ వారీగా మెరుగైన పారిశుద్ధ్యం కోసం కృషి చేయాలని, విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే వారిని సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. ఈ నెల 10 నాటికి నగరంలో రోడ్ల మీద పశువులు ఉండడానికి వీలు లేదని, వాటిని పట్టుకొని నగరపాలక సంస్థ గోశాలకు తరలించాలన్నారు. ఎంహెచ్ఓ, సీఎంహెచ్ఓ ప్రజారోగ్య విభాగ పనితీరును ఎప్పటికప్పుడు క్షేత్ర స్థాయిలో పరిశీలించి, పనితీరు మెరుగయ్యేలా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. సీఎంఓహెచ్ఓ డాక్టర్ శోభారాణి, ఎంహెచ్ఓ రవిబాబు, బయాలజిస్ట్ మధుసూదన్, ఏఎంహెచ్ఓ ఆనందకుమార్, రాంబాబు, శానిటరీ సూపర్వైజర్లు ఆయూబ్ ఖాన్, సోమశేఖర్, ప్రజారోగ్య విభాగ సూపరింటెండెంట్ పోలేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

12న మహతీ స్వరసుధ రజతోత్సవాలు

నగరంపాలెం: గత 24 ఏళ్లుగా ప్రతినెలా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించినట్లు మహతీ స్వర సుధ వ్యవస్థాపక అధ్యక్షురాలు పత్రి నిర్మల తెలిపారు. బృందావన్‌గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి వారి దేవాలయ ఆవరణలో గురువారం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అలనాటి సినీ మధుర గీతాలతోపాటు జానపద, దేశభక్తి గీతాలు, అన్నమయ్య కీర్తనలు, జావళీలు, బృందగానాల వంటివి ప్రదర్శిస్తున్నామని అన్నారు. అనేక మందిని ప్రోత్సహించి మంచి కళాకారులను తీర్చిదిద్దామని చెప్పారు. రజతోత్సవ ప్రథమ కార్యక్రమంలో భాగంగా ఈనెల 12న ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. మదన్‌మోహన్‌రావు, కె.రవిబాబు, జి.వీరయ్య, ఎ.వీరరాఘవ, ఎండీ జరీనా, హేమమాలిని, బి.కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

వేధింపుల భర్త, అత్తమామలపై కేసు

లక్ష్మీపురం: వివాహం జరిగినప్పటి నుంచి భర్త, అత్త మామలు అధిక కట్నం తీసుకురావాలంటూ వేధింపులు గురి చేస్తున్నారని బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరండల్ పేట పోలీసులు గురువారం రాత్రి కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వేళంగిణినగర్‌కు చెందిన లక్ష్మీ తిరుపతమ్మకు 2023లో బాపట్ల జిల్లా, బల్లికురవ మండలానికి చెందిన రాజేష్‌తో వివాహం జరిగింది. నాటి నుంచి భర్త, అత్త మామలు, బావ కలిసి లక్ష్మీ తిరుపతమ్మను కులం పేరుతో దూషిస్తూ అధిక కట్నం కోసం వేధిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

విద్యార్థులు ప్రతిభావంతులుగా ఎదగాలి



గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో ప్రతిభావంతులుగా ఎదగాలని జీకేఆర్ హైస్కూల్ డైరెక్టర్లు జి.కొండారెడ్డి, జి.జనార్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. జీకేఆర్ హైస్కూల్ పట్టాభిపురం, ఏటీ అగ్రహారం క్యాంపస్‌లలో గురువారం నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు వివిధ అంశాల్లో పోటీలను నిర్వహించారు. ఈసందర్భంగా డైరెక్టర్లు మాట్లాడుతూ విద్యార్థులు పెద్దలను గౌరవిస్తూ, క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. నూతన సంవత్సరంలో లక్ష్యాన్ని చేరుకునే విధంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు శైలజ, సుశీల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీశ్రీ రచనలు అజరామరం

లక్ష్మీపురం: మహాకవి శ్రీ శ్రీ రచనలు అజరామరంగా నిలిచిపోతాయని అవగాహన సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి అన్నారు. అరండల్‌పేటలోని సంస్థ కార్యాలయంలో కొండాశివరామిరెడ్డి ఆధ్వర్యంలో గురువారం మహాకవి శ్రీశ్రీ జయంతి కార్యక్రమం జరిగింది. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.